విశాలాంధ్ర

సోమవారం 01 జూలై 2024

విశాలాంధ్ర కృష్ణా జిల్లా

వసతుల కల్పనే లక్ష్యం

అందుబాటులో వైద్యం

ప్రతిపాదనలు రూపొందిస్తున్న అధికారులు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్యకేంద్రాలను వైకాపా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో అలంకారంగా మారిపోయాయి. ప్రజలు సర్వజన ఆసుపత్రి, లేదంటే ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. ఈ సమస్యలపై ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించిన మంత్రి కొల్లు రవీంద్ర అవసరమైన వసతులపై ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆ దిశగా కార్యాచరణ చేపట్టారు.

అదనంగా కేంద్రాలు ఏర్పాటు

మంత్రి ఆదేశాలతో నగరంలోని అన్ని ఆరోగ్యకేంద్రాల్లో పూర్తిస్థాయి వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నగరంలో ఉన్న ఆరోగ్యకేంద్రాలకు కల్పించాల్సిన వసతులు, అవసరమైన నిధులు తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నారు. బందరు మండలం లో ప్రస్తుతం మండలంలోని తాళ్ళపాలెం, చిన్నాపురంలో రెండు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా బుద్దాలపాలెం, పోలాటితిప్ప గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

భవనాలులేక....ఉన్నా ఉపయోగంలో లేక...

ప్రస్తుతం నగరంలోని చిలకలపూడి, నారాయణపురం, వర్రేగూడెం, శారదానగర్, బందరుకోట, రైలుపేట ప్రాంతాల్లో పట్టణ ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వర్రెగుడెం, చిలకలపూడి కేంద్రాలకు మాత్రమే భవనాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో రైలుపేట కేంద్రానికి నిర్మిస్తున్న భవన నిర్మాణం చివరిదశలో ఆగిపోయింది శారదానగర్‌లోని కేంద్రాన్ని పనులు పూర్తవకుం డానే హడావుడిగా ప్రారంభించేశారు. ల్యాబ్ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో అక్కడ పరీక్షలు నిర్వహించడానికి అవకాశం లేకుండా పోయింది. పరికరాలన్నీ మూలన పడి ఉన్నాయి. పరీక్షల కోసం వచ్చిన రోగులకు సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నార్ర. మరుగుదొడ్లు నిర్మించినా ఇప్పటికి నీటి సరఫరా లేదు. దీంతో వైద్యులు సిబ్బంది కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇప్పటివరకు పరిష్కా రం కాలేదు. బందరుకోటలో చేపట్టిన భవనం కూడా అసంపూర్తిగానే మిగిలి పోయింది. ఇలా కొన్ని కేంద్రాలకు భవనాల లేక ఉన్న భవనాలు ఉపయోగపడక రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందకపోవడంతో రోగులు అక్కడకు వెళ్లాలంటేనే వెనుకంజ వేస్తున్నారు.

> **రోగులకు అందుబాటులో వైద్యం**
>
>
>
> నగరంలోని రైలుపేట, బందరుకోట కేంద్రాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. శారదానగర్ కేంద్రంలో ఉన్న సమస్యలను నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి ఆదేశాలతో అన్ని కేంద్రాలపై నివేదిక అందించడంతో పాటు బందరు మండలంలో అదనంగా పీహెచ్‌సీల ఏర్పాటుకు సంబందించి కార్యాచరణ చేపట్టాం. త్వరలోనే దీనిపై సర్వే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. రోగులకు అందించే సేవల్లో ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం..
>
> –గీతాబాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి

జడ్జి సునీతకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరామర్శ

గంధం వీర రాఘవయ్యకు ఘనంగా నివాళులు

విశాలాంధ్ర-మోపిదేవి : ఇటీవల పితృ వియోగానికి గురైన తూర్పు గోదావరి జిల్లా జడ్జి గంధం సునీతని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. ఆదివారం మోపిదేవి మండలం పెద్దకళ్లేపల్లిలో జడ్జి సునీత స్వగృహంలో ఆమెను పరామర్శించారు. జడ్జి తండ్రి గంధం వీర రాఘవయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. వీర రాఘవయ్య మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతా రామాంజనేయులు, గ్రామ ప్రముఖులు అరజా కిరణ్ కాంత్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అంబేద్కర్ భవనం : మంత్రి కొల్లు

-పాడుబడి మూతబడ్డ అంబేద్కర్ భవనాన్ని పరిశీలించిన రవీంద్ర
-శిథిలమైన అంబేద్కర్ భవన స్థానంలో మల్టీ పర్పస్‌హాల్ నిర్మిస్తాం
-ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సోషల్ వెల్ఫేర్ డీడీకి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : గత పాలకుల నిర్లక్ష్యనికి నిదర్శనం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహం అని, నిర్లక్ష్యంతో అంబేద్కర్ విగ్రహం శిథిలావస్థకు చేరిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్‌లోని అంబేద్కర్ భవనాన్ని మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించారు. నగరంలోని పలు దళిత సంఘాల ప్రతినిదులతో కలిసి శిథిలావస్థకు చేరిన అంబేద్కర్ భవనాన్ని సందర్శించిన రవీంద్ర గత పాలకులు వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004లో అప్పటి తెలుగుదేశం హయాంలో దళితుల కోసం అంబేద్కర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ భవనాన్ని అప్పటి తెలుగుదేశం అభ్యర్థి కడియం శ్రీహరి చేతులమీదగా ప్రారంభం చేశారు. 25 సంవత్సరాల చరిత్ర ఉన్న అంబేద్కర్ భవనం శిథిలావస్థకు చేరటం చాలా బాధాకరమైన విషయం అని, ఆ తర్వాత నిర్వహణ లోపానికి గురైయిందన్నారు. 2014లో అంబేద్కర్ భవన మరమతులకు నోచుకోగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అంబేద్కర్ భవనాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గత 5 సంవత్సరాలుగా మూతపడిందన్నారు. అంబేద్కర్ భవనం పక్కనే కోట్ల రూపాయలతో వైసీపీ కార్యాలయ భవన నిర్మాణంపై పెట్టిన దృష్టిలో కొంతైనా అంబేద్కర్ భవనంపై చూపలేదని మాజీ మంత్రి పేర్ని నాని పై మంత్రి రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం దళిత సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే అంబేద్కర్ భవన స్థానంలో అధునాతన సౌకర్యాలతో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలును నిర్మిస్తామని కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్రతో పాటు జనసేన పార్టీ బండి రామకృష్ణ, జనసేన కార్యకర్తలు,టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్కకు మోక్షం రాదా?

తరుముకొస్తున్న ఖరీఫ్ సీజన్
అధికారులలో కొరవడిన చలనం
పొలాలు ముంపు తప్పదా??

అయినంపూడి డ్రైన్లో మేటేసిన గుర్రపు డెక్క

విశాలాంధ్ర-కూచిపూడి : ఖరీఫ్ సీజన్ తరుము కొస్తున్నా మేజర్ డ్రైనులలోగుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపులు, మరమ్మతులు చేయకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్. సీజన్లో అధిక వర్షాలు కురిస్తే వరిపైరు ముంపు తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి తాము బలియ్యేపరిస్థితులు వస్తున్నా వారిలో ఏ విధమైన స్పందన కనబడటం లేదని రైతులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. దీనితో వరి నాట్లసమయంలో, కోతల సమయంలో గతి ఏడాది పరిస్థితిలే కొనసాగు తాయేమోనన్న భయాందోళన లను రైతులువ్యక్తం చేస్తున్నారు. ఇటీవలనే బాధ్యతలు చేపట్టిన నీటిపా రుదల శాఖ మంత్రి గుర్రపు డెక్క, తూటుకాడలను తొలగించి పంటలు కాకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసిన సంగతిని సైతం రైతులు ప్రస్తావిస్తు న్నారు. అయినంపూడి, భీమనది, ఉప్పాయికోడు మురుగుకాలవలలో తూటుకాడ, గుర్రపు డెక్కల మూలంగా గత ఏడాది వేలాది ఎకరాలలో పంట నాశనం అయిన సంగతి అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు సైతం తెలిసిందే... గత ఏడాది ఖరీఫ్ సీజన్లో పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్తగా ఉన్న వర్ల కుమార్ రాజా ప్రస్తుతం ఎన్డీఏ కూటమి శాసనసభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో రైతుల కడగండ్లు విని స్పందించిన ఆయన ప్రస్తుతం చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్క తొలగించి ప్రకృతి వైపరీత్యాలకు వరిపైరు దెబ్బతినకుండా చూడాలని పలువురు రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. అయినంపూడి భీమ నది, ఉప్పాయికోడు,మేజర్ మహేందర్ డ్రైన్లుకింద వేదాద్రి ఎకరాలుముంపు పాలు కాకుండా చూసేందుకు అధికారులను సమాయత్తం చేయాలని కూడా సూచిస్తున్నారు. అవసరమైన పరిస్థితుల్లో యంత్రాలను వినియోగించి ముంపు నీరు దగువప్రాంతాలకిసరఫరా అయ్యేం దుకు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

మంత్రి రవీంద్రను కలిసిన సినీ దర్శకుడు మారుతీ

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలోప్రముఖ సినీ దర్శకుడు దాసరి మారుతీ ఆదివారం ఉదయం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. రవీంద్ర ఘన విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవడం పట్ల మారుతీ హర్షం వ్యక్తం చేశారు. రవీంద్ర నాయకత్వంలో మచిలీపట్నం మరింత అభివృద్ధి సాధించగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

సుమతి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-చల్లపల్లి : మండల పరిధి లోని నిమ్మగడ్డ ప్రాధమిక హెచ్ఎం క్రైలా సుమతికుమారి పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో- 2 పరిశె వెంకటేశ్వరరావు హెచ్ఎం సుమతికుమారి-చెరుకూరి రాఘవులు దంపతులకు పూలమాలవేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో పరిశె మాట్లాడుతూ గత 41 సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో పనిచేసిన సుమతికుమారి విద్యాబోధనలో ప్రత్యేక శ్రద్ధ. ఆయా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. గ్రామస్థులు సుమతికుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కెబిఎన్ శర్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ పి ప్రశాంతి, పాస్టర్ ఎస్ సంగీతరావు, ఉపాధ్యాయుడు బి చినకేశవరావుతో పాటు గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

విశాలాంధ్ర-గుడివాడ : 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అవనిగడ్డ డిపో ఆర్‌టిసి డ్రైవర్‌పై దుర్భాషలాడి, దాడిచేసిన కేసులో నకిలీ విలేఖరి అరెస్ట్ చేసినట్లు 2టౌన్ సిఐ దుర్గారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ డిపో ఆర్‌టిసి డ్రైవర్ సిరివెళ్ళ రాకేష్‌పై గుడివాడకి చెందిన పట్టపు శివవెంకటనాగేంద్ర, పంచకర్ల శ్రీనివాస్ అనే నకిలీ విలేకరి మద్యమత్తులో దాడి చేయడం జరిగిందన్నారు. వారిలో శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నాట్లు, మరో ముద్దాయి పట్టపు శివ పరారీలో ఉన్నట్లు 2టౌన్ సి.ఐ దుర్గారావు, ఎస్ఐ నాగరాజులు ప్రకటనలో తెలిపారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ : ఎంపీడీవో

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు జూలై 1వ తేదీ ఉదయం గం5:00ల నుండి సచివాలయ సిబ్బందితో ఇంటి వద్ద ఇస్తారని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి ఆదివారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 4,592 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని అన్నారు. దివ్యాంగులకు రూ6,000లు, వృద్ధాప్య తదితర లబ్ధిదారులకు గత ప్రభుత్వంలో రూ 3,000 లు ఇచ్చేవారని నేటి నుండి రూ4000 లు మరియు ఏప్రిల్, మే, జూన్ నెలతో కలుపుకుని 3 నెలలు నెలకు రూ1000లు చొప్పున రూ3000 మొత్తంగా రూ7000 పెన్షన్ దారులకు మూడు కోట్ల 68 లక్షల 3000 రూపాయలు ప్రభుత్వ సిబ్బంది జూలై మొదటి రోజే పెన్షన్ దారులకు అందిస్తారని ఎంపీడీవో వివరించారు.

కొండాలమ్మ అమ్మవారి దేవాస్థానానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: జిల్లాలోని ప్రఖ్యాతిగాంచిన శక్తిపీఠాలలో ఒకటై, మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఆదివారం సంధర్భంగా అమ్మవారిని సుమారు 15,000 మంది భక్తులు దర్శించుకొని, అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొనియున్నారు. కొండలమ్మ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా అమ్మవారి దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు గారు ఏర్పాట్లను పరిశీలించారు.

చలసాని వ్యక్తిత్వం స్ఫూర్తి దాయకం : ఎమ్మెల్యే కుమార్‌రాజా

విశాలాంధ్ర-కూచిపూడి : కార్యదీక్షలో యువతకు స్ఫూర్తి దాయకమైన అశోక్ కుమార్ సేవలు పలువురికి ఆదర్శనీయ మని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖలో 33సంవత్సరాలపాటు వివిధ హోదాలలో విధులు నిర్వహించి కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా, కృష్ణా జిల్లా పరిషత్ ఉద్యోగుల సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన చలసాని అశోక్ కుమార్ అభినందన సభ ఆదివారం ఆయన స్వగ్రామమైనమొవ్వ మండలంలోని భట్లపెనుమర్రు శ్రీ పింగళివెంకయ్య భవనంలో ఆశేష అభిమానుల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా కల్లేపల్లి శ్రీనివాసరావు వివరించగాముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ చిరునవ్వుతో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ ధర్మమే ఊపిరిగా, మంచితనమే మానవత్వంగాభావిస్తూ అందరితో కలిసిమెలిసితిరిగుతూ యూనియన్ నాయకునిగా సమస్యలు పరిష్కరించి సాటి ఉద్యోగుల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న అశోక్ విశ్రాంతి సమయంలో ఆయన సేవలు గ్రామాభివృద్ధికి వినియోగించాలని కోరారు. పండగ వాతావరణం గా కొనసాగిన ఈ అభినందన సభలో కృష్ణాజిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఆనంద్ కుమార్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ వెస్ట్ కృష్ణ అధ్యక్షులు ఏ. విద్యాసాగర్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, నెల్లూరు, ప్రకాశం, విశాఖ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘ కృష్ణా జిల్లా శాఖ కన్వీనర్ జే.ఎల్. ప్రసాద్, కార్యవర్గ సభ్యులు సభ్యులు,, కృష్ణా జిల్లా పరిషత్ ఉద్యోగుల సహకార పరపతి సంఘం డైరెక్టర్లు, ఆఫీస్ సిబ్బంది, జిల్లా పరిషత్ ఉద్యోగులు ,రెండు తెలుగు రాష్ట్రాలలో స్థిరపడిన బంధువులు సన్నిహిత వర్గం తో పాటు పూర్వపు కృష్ణా జిల్లాలోని పలు శాఖలకు సంబంధించిన అధికారులు, విశ్రాంతి అధికారులు, జిల్లా పరిషత్ ఉద్యోగ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర,ఎంపీపీ కొండేటి ఇందిర దంపతులు, ఉపసర్పంచ్.చలసాని వెంకటరత్నం,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామకృష్ణారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు హాజరైనారు. చలసాని అశోక్ కుమార్‌ను శాలువాలతో, పూలదండలతో, పుష్పగుచ్చాలతో అభినందించి సత్కరించారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : మండలి



విశాలాంధ్ర-మోపిదేవి : ప్రభుత్వం పేదల వైద్యం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం మోపిదేవి మండలం పెద్దకళ్లేపల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పరిశీలించారు. 24/7 ఆసుపత్రిగా ప్రజలకు సేవలు అందిస్తున్న ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది పని తీరు గురించి ఆరా తీశారు. ప్రస్తుతం ఉన్న వైద్యులు, సిబ్బంది పని తీరు కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని గ్రామస్థులు తెలిపారు. గతంలో 40-50 ఉండే ఓపి ప్రస్తుతం 100-120 కు పెరిగిందని తెలిపారు. ఈ కేంద్రంలో 24/7 సేవలు అందిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ముగ్గురు స్టాఫ్ నర్సులకు జనరల్ హోఫ్, సెలవు సమయంలో ఇబ్బంది వస్తోందని, మరొక స్టాఫ్ నర్సును నియమించాలని గ్రామ ప్రముఖులు అరజా కిరణ్ కాంత్ ఎమ్మెల్యేకు సమస్య వివరించారు. దీంతోపాటు వాచ్ మెన్ నియామకానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతా రామాంజనేయులు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు గొర్రెపాటి నాగేశ్వరరావు, కేతరాజు శ్రీనివాసరావు, పంద్రాజు సత్యనారాయణ, మారుబోయిన సుబ్బారావు, కూరేటి జగన్, అరజా జ్ఞాన చంద్రరావు పాల్గొన్నారు.

వివాహ బంధాన్ని తెలిపిన 'కనకపుష్యరాగం'

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : దృశ్య వేదిక నెలవారి కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై ఆరు దశాబ్దాల క్రితం విస్తృతంగా ప్రదర్శించబడిన రాఘవ రచించిన ఎస్ కె మిశ్రో దర్శకత్వం వహించిన కనకపుష్యరాగం నాటకం వివాహ బంధాన్ని తెలుపుతూ ప్రదర్శితమైంది. పరిస్థితుల ప్రభావంతో ఇష్టమైన వారితో ఒక్కోక్కప్పుడు వివాహం జరగకపోయినా వివాహం చేసుకున్న వారితో బంధాన్ని బలీయం చేసుకుని కాపురాన్ని కొనసాగించాలనే ఇతివృత్తంతో నాటకం రసవత్తరంగా కొనసాగుతుంది. నటీనటులుగా బి రూపాశ్రీ, జి ఎస్ డి కుసుమసాయి, దొంతాల ప్రకాష్, ఈవన భాగ్యరాజ్, కత్తి శ్యాంప్రసాద్, ఈవన రమేష్ బాబు, బొర్రా నరేన్ లు వారి వారి పాత్రలలో ఔచితీభరితంగా నటించి మెప్పించారు. నటరాజు కొప్పిలి వేంకటేశ్వరరావు శత జయంతి సందర్భంగా జరిగిన ఈ నాటక ప్రదర్శనకు నిర్వహణ హెచ్ వి ఆర్ ఎస్ ప్రసాద్ చేయగా ఆహార్యం శ్రీధర్, గేయాలు సిరికి స్వామినాయుడు, దృశ్య బంధనం ఫణి, ధ్వని నందివాడ కిరణ్ తదితరులు నటీనటుల నటవైదుషాన్ని రక్తికట్టిస్తూ సహకరించారు.

ఐటిఐలో ప్రవేశాలకు 2వ విడత దరఖాస్తులు

విశాలాంధ్ర-గుడివాడ : ప్రభుత్వ, ప్రైవేట్, ఐ.టి.ఐలో 8 వ తరగతి పాస్ అయిన అభ్యర్థులకు రెండవ విడుత అడ్మిషన్స్ దరఖాస్తు కొరకు వచ్చే నేత 24వ తేది లోపుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కె.బి.ఆర్ ప్రభుత్వ శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ కన్వీనర్ ఎల్ గౌరిమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 25-07-2024 తేది లోపు అప్రువల్ చేయించుకోవాలని, ప్రభుత్వ ఐటిఐలో జూలై 27న, ప్రైవేట్ ఐటిఐలో జూలై 29 తేది లలో కౌన్సిలింగ్ హాజరు కావలన్నారు. ఎస్సీఎస్టీ వారు మినహా మిగిలిన వారు రూ. 60 చెల్లించాలన్నారు వివరాలకు 08674 295953, 8297574757, 9985162555 సంప్రదించాలని గౌరిమణి తన ప్రకటనలో తెలిపారు.

పంటకాల్వకు జలకళ

విశాలాంధ్ర-కూచిపూడి : శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షంతో పంట కాలవలకు నీరు చేరడంతో రైతులలో ఆనందం వెల్లి విరిసింది. జూన్ నెల పూర్తయితున్నావరి నారుమడులుపోసుకోవటానికి పంట కాలవలకునీరు విడుదల చేయకపోవడంతో ఈ వర్షం కాసింత ఊపిరినిచ్చింది. విద్యుత్ మోటార్.బోర్లు, ఆయిల్ యింజనుల సహకారంతో పలువురు రైతులు వరినారుమడులు పోసుకొన్నారు. అయితే ఆ సౌకర్యం లేని రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ స్థితిలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రధాన కాలువలకు కొద్దిపాటి నీరు రావడంతో కొంతమంది రైతులు కాలవలోని నీటితో నారుమడులుపోసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుత తరుణంలో బీపీటీలుకాని, 150 రోజులలో దిగుబడులు నిచ్చే వరి వంగడాలపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

ఉపాధ్యాయ వృత్తికి మణిహారం మాణిక్యాలరావు : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విశాలాంధ్ర-గన్నవరం : ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మాణిక్యాలరావు అనిఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణ రావు అన్నారు. ఆదివారం గన్నవరం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు కే. మాణిక్యాలరావు ఉద్యోగ విరమణ సందర్భంగా రాయ నగర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమాసం జరిగింది అభినందన సభకు మాజీ ఎమ్మెల్సీ బి. నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు, యుటిఎఫ్ కోశాధికారి మరీదు వరప్రసాద్, బాపులపాడు ఎంఈఓ సురేష్ కుమార్, ఉంగుటూరు ఎంఈఓ సాంబశివరావు, మాజీ ఎంఈఓ జయబాబు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు గొట్టం రవిబాబు, నాయకులు ప్రసాద్, బాలోత్సవం నాయకులు గన్నె వెంకట్రావు, కర్రా వరప్రసాద్, సామాజిక వేత్త డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్, వికేఆర్ కళాశాల మాజీ అధ్యాపకులు టివి. సుబ్బారావు, గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఝాన్సీ లక్ష్మి, ఆత్కూరు జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం కెవిబికే. సుధాకర్, రిటైర్డ్ పి. ఇ. టి. టివిఎస్ఆర్కే ప్రసాద్, పిల్లల తల్లిదండ్రులు మాణిక్యాలరావు దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మెమొంటోతో సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గొల్లనపల్లి హైస్కూల్ హెచ్ఎం. జగదీశ్వరరావు కార్యక్రమం సంధాన కర్తక వ్యవహరించారు.

స్నేహితుని స్మృతిలో సేవ ఆదర్శనీయం



విశాలాంధ్ర-చల్లపల్లి : స్నేహితుని స్మృతిలో సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని వైస్ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక పడమర వైపునకు చెందిన పసుపుదళం సైనికుడు, టీడీపీ కార్యకర్త సింహాద్రి యాదవ్ జనవరి నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఈరోజు అతని జయంతి సందర్భంగా స్నేహితులంతా కలిసి పులిహోర పాకెట్లు పంచిపెట్టారు. అతిధులు మోర్ల రాంబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో దివంగత సింహాద్రి యాదవ్ స్నేహితులు, పెద్దలు గొరిపర్తి సుబ్బారావు, శివరామకృష్ణ, సాయి కిరణ్, శ్రీరాములు, హనుమంతరావు, వెంకయ్య, వెంకట్, కొలుసు అనీల్, మణి, డొక్కు విజయకృష్ణ, మాగంటి దీపు, కొలుసు శివ, వార్డు సభ్యుడు బళ్ళ వాసు, పరిశె రఘు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర వసతిగృహం

విద్యకు ఉంది భరోసా...
వసతికి ఏదీ ఆసరా?

కూలేదశలో ఎస్సీ వసతిగృహం
అద్దెభవనం లభించక మూసివేత

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: పేద విద్యార్థులకు ప్రభుత్వం గతంలో కల్పించిన విద్యావసతి సదుపాయాలు గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై, నేడు అందని ద్రాక్షగా మారాయి. విస్సన్నపేటలో గతంలో ప్రభుత్వం వివిధ ప్రాంతాల నుంచి విస్సన్నపేటలో విద్యనభ్యసించేందుకు వచ్చే బాలుర, బాలికలకు నాలుగు వసతిగృహాలు ఏర్పాటు చేసి, సుమారు వందమందికి పైగా సదుపాయం కల్పించింది. బాలుర, బాలికలకు వేరువేరుగా ఏర్పాటు చేసిన ఈ గృహాల్లో కళాశాల, పాఠశాల విద్యార్థులకు కలిపి నిర్వహిస్తున్న గృహం గత మూడేళ్లుగా శిథిలావస్థకు చేరింది. ఈ క్రమంలో కరోనా కారణంగా మూతబడటంతో, అభివృద్ధికి ప్రభుత్వం ఆలోచించిన దాఖలాలు లేవు. కొద్దికాలం క్రితం ఒకవైపున ప్రహరీగోడ కూలిపోయింది. మరోవైపు లోపలిభాగంలో స్లాబ్ పెచ్చులూడుతూ, గోడలు నెర్రెలిచ్చి ప్రమాదకరంగా మారింది. ఇక్కడి పరిస్థితిని గృహం అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమందించారు. ప్రస్తుతం భవనాన్ని ఖాళీ చేసి, గ్రామంలోనే ఉన్న అద్దె భవనంలోకి

మార్పు చేయాలని సూచనలిచ్చారు. ప్రభుత్వం సూచించిన అద్దె తక్కువగా ఉండటం వంటి పలు కారణాలతో విస్సన్నపేటలో భవనం లభించలేదు. దీంతో ప్రమాదకర భవనంలో విద్యార్థులను ఉంచలేక, ప్రైవేటు భవనంలోకి వెళ్లే అవకాశం లేక వసతిగృహ నిర్వహణ నిలిచిపోయింది. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు సైకిళ్లు, బస్సులపై వచ్చి, విద్యనభ్యసిస్తూ, అవస్థలు ఎదుర్కొంటున్నారు.

చొరవ చూపితే...వసతికి ఆస్కారం...

ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపితే ఎస్సీ విద్యార్థులకు అవసరమైన వసతి సమకూరే అవకాశం ఉంది. విస్సన్నపేటలో కొనసాగుతున్న కేవీఆర్, ఎమ్మెస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు భవనాలు ఉన్నాయని, అక్కడ విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించుకోవచ్చని కళాశాల అధికారులు, స్థలదాతలు చెబుతున్నారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ పరమైన అనుమతులు ఇవ్వాలని కోరుతూ తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో స్వయంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్య సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేయాలని ఆయన సాంఘిక సంక్షేమశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విద్యాసంవత్సరం ఆరంభమై తరగతులు నడుస్తున్న తరుణంలో వసతిగృహ అడ్మిషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

దుర్గమ్మ సన్నిధిలో డీజీపీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారిని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం ఆయన సతి సమేతంగాగా విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో డీజీపీకి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితుల వేద ఆశీర్వచనం పొందారు. ఆలయ ఈవో రామారావు వారికి తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటం అందజేశారు.

తిరుపతమ్మ సేవలో భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలులోని గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దర్శించుకు న్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా ఆలయ కార్య నిర్వహణ అధికారి రమేష్ నాయుడు సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ తెలుగు దేశం పార్టీ నాయకులు నూతలపాటి చెన్నకేశవ రావు. జనసేన నాయకులు లగడపాటి శంకర్.తునికి పాటి. శివా.ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ధనం కంటే దాతృత్వం మిన్న అని ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ లయన్ కొల్లూరి అన్నారు. ఆదివారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యాలయంలో చిన్నారులకు పుస్తకాలు, స్టేషనరీ, స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొల్లురి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల దాతృత్వాన్ని ఉపయోగించుకొని చక్కగా చదువుకోవాలన్నారు. చిన్నారులు చిన్నప్పటినుంచే క్రమశిక్షణ, పెద్దలు, ఉపాధ్యాయులను గౌరవించడంతో అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి హెల్పింగ్ టుగెదర్ అధ్యక్షురాలు డాక్టర్ నాగ మల్లేశ్వరి, కార్యదర్శి షేక్.షఫీవుల్లా, కోశాధికారి రహీమా, డాక్టర్ బి.వసంత కుమార్, దుర్గాప్రసాద్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి దుర్గగుడిలో శాకంబరీ ఉత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జులై 19వతేదీ నుంచి 21వతేదీ వరకు శాకంబరీ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామరావు అన్నారు. ఉత్సవాల నిర్వహణ నిర్వహణపై మహామండపంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జూలై 19వతేదీన ఉదయం 8గంటల వరకు విఘ్నేశ్వర పూజాతో శాకంబరీ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు ఆలయ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. సందర్భంగా రామారావు మాట్లాడుతూ శాకంబరీ ఉత్సవాల నిర్వహణలో గతంలో ఎదురైన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేసి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి తమకు శాకంబరీ ఉత్సవాల విధులు కేటాయించడం జరిగిందన్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజలు తమకు తోచిన విధంగా కూరగాయాలు, పండ్లు, ఆకుకూరలు అమ్మవారికి సమర్పించాలన్నారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో రాష్ట్రం, రైతులు సుభిక్షంగా ఉండాలని సంకల్పిస్తూ శాకంబరీ ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 6వతేదీ నుంచి ఆగస్టు 5వతేదీ వరకు ఆషాడమాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున కనకదుర్గమ్మవారికి పవిత్ర సారె సమర్పించనున్నందున అందుకు దేవస్థానం తగు ఏర్పాట్లు చేసిందన్నారు. జూలై 14వతేదీన హైదరబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించనున్నారని తెలిపారు. జూలై 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై తొలిసారి వారాహి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అలయ అధికారులు, ప్రధాన అర్చకులు, పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ: జులై 1, సోమవారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారులకు ఇళ్ల వద్దే అందించే ప్రక్రియను సజావుగా నిర్వ హించేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద చేపట్టే సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె ఆదివారం డీఆర్‌డీఏ పీడీ, ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జులై 1వ తేదీ ఉదయం ఆరు గంటలకు పెన్షన్ పంపిణీని ప్రారంభించి.. ప్రక్రియ సాఫీగా సాగేలా చూడాలన్నారు. లబ్ధిదారుల సామాజిక భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ మొత్తాన్ని ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఉదయం ఆరు గంటలకు పంపిణీని ప్రారంభించి.. తొలిరోజే 100 శాతం పంపిణీ పూర్తిచేసేలా కృషిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులకు ముందుగా సమాచార మిచ్చి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. జిల్లాలో 2,35,477 మంది పెన్షన్‌దారులకు రూ. 160.53 కోట్ల మేర మొత్తాన్ని అందించాల్సి ఉందని... ప్రతి 50 మంది లబ్ధిదారులకు ఒకరు చొప్పున గ్రామ, వార్డు సచివాలయ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. ఎ.కొండూరు మండలంలో 7,524 పెన్షన్లు, చందర్లపాడులో 10,086, జి.కొండూరులో 8,771, గంపలగూడెంలో 11,631, ఇబ్రహీపట్నంలో 4,879, జగ్గయ్యపేట (అర్బన్)లో 4,935, జగ్గయ్యపేటలో 10,373, కంచికచర్లలో 10,438, కొండపల్లి (అర్బన్)లో 5,322, మైలవరంలో 9,775, నందిగామలో 8,090, నందిగామ (అర్బన్)లో 4,308, పెనుగంచిప్రోలులో 8,620, రెడ్డిగూడెంలో 7,328, తిరువూరులో 6,899, తిరువూరు (అర్బన్)లో 3,442, వత్సవాయిలో 9,763, వీరుల్లపాడులో 8,886, విజయవాడ (అర్బన్)లో 68,730, విజయవాడ రూరల్‌లో 17,328, విస్సన్నపేట మండలంలో 8,349 పెన్షన్లు ఉన్నట్లు వివరించారు. లబ్ధిదారులకు ముఖ్యమంత్రి (నారా చంద్రబాబు నాయుడు లేఖను అందించడంతో పాటు ఎకనాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదులు స్వీకరణ:

జూలై 1వ వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రజల ఆశలు నెరవేర్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే తాతయ్య

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : సంక్షేమ పాలకుడు, సామాజిక పెన్షన్ విధానానికి ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్ పేరును పెన్షన్ల కార్యక్రమానికి పెట్టారని, ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇకపై మీ ఇంటి వద్దకొచ్చి సామాజిక పెన్షన్ల పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. సోమవారం పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని, అందరి మద్దతుతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ప్రజలకు అండగా నిలుస్తూ, సంక్షేమం చూసే ప్రజా ప్రభుత్వం కొలువుదీరిందన్నారు. ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడమే తక్షణ కర్తవ్యం అని ఎన్నికలకు ముందే మ్యానిఫెస్టోలో ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు చెప్పినట్లు పెన్షన్‌ను ఒకేసారి రూ. 1000 పెంచాం అని, ఇకపై రూ.4000 పెన్షన్ ఇస్తాం అన్నారు. దివ్యాంగులకు రూ.3000 పెంచి, ఇకపై రూ.6000 ఇస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.28 వర్గాలకు చెందిన పెన్షన్ లబ్దిదారులకు జూలై 1వ తేదీ నుంచే పెంచిన పెన్షన్లు ఇంటి వద్ద అందిస్తామన్నారు. కొత్త ప్రభుత్వం ముందు అనేక ఆర్థిక సమస్యలు ఉన్నాయి. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే ముఖ్యమంత్రి మంచి చేసే నిర్ణయాలు తీసుకున్నారన్నారు. పెన్షన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు అదనంగా రూ.819 కోట్ల భారం పడుతుందని, ప్రజా శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.పెరిగిన పెన్షన్‌తో ఆర్థిక స్వావలంబన, భరోసా లభిస్తుందని ఆశిస్తున్నట్లు ప్రజా భద్రత మా బాధ్యత అని ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఎప్పుడూ మంచి చేయాలని చూసే ప్రజా ప్రభుత్వాన్ని, నారా చంద్రబాబు నాయుడుని ఆశీర్వదించమని కోరుకుంటున్నామన్నారు.

గాంధీ కో-ఆపరేటీవ్ బ్యాంక్ సేవలపై దుష్ప్రచారం

అనుమానాలు ఉంటే రికార్డులు పరిశీలించుకోవచ్చు : చైర్మన్ వేమూరి

విశాలాంధ్ర-విజయవాడ: సహకార సూత్రాలకు కట్టుబడి, సమిష్టి కృషితో పని చేస్తున్న గాంధీ కో-ఆపరేటీవ్ బ్యాంక్ సేవలపై ఎవరికైనా అనుమానాలు ఉంటే బ్యాంక్ పని వేళ్లలో వచ్చి రికార్డు పరిశీలించుకోవచ్చని బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకట్రావ్ అన్నారు. బ్యాంక్‌లో అవకతవకలు జరిగాయని కొంత మంది దుష్ప్రచారం చేయటాన్ని తాము ఖండిస్తున్నట్లు చెప్పారు. గాంధీ కో-ఆపరేటీవ్ బ్యాంక్ 96వ మహాజన సభ మొగల్రాజపురంలోని అమ్మ కళ్యాణమంటపంలో ఆదివారం జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన వెంకట్రావ్ మాట్లాడుతూ దాదాపు 20వేల 10 మంది 'ఏ' తరగతి సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిపారు. సుమారు రూ.682కోట్లు డిపాజిట్లతో రూ.476 కోట్ల రుణాలు మంజూరుతో రూ.1662.86 లక్షల షేరు ధనంతో వివిధ నగరాల్లో 11 బ్రాంచ్‌లు కలిగి ఉందన్నారు. బ్యాంకు సేవల్లో ఏదైనా తప్పులు జరిగితే పూర్తి బాధ్యత బోర్డు డైరెక్టర్‌లందరు బాధ్యత వహించి తప్పుకుంటారని స్పష్టం చేశారు. సీఈఓ ఎంబీ పద్మిని 2023-24 పరిపాలన నివేదిక, ఆడిట్ రిపోర్టు, అదనపు బడ్జెట్ లావాదేవీలు, రుణాల మంజూరు, తదితర అంశాలను వివరించారు. సీనియర్ సభ్యులు మహబూబ్ ఆజం మాట్లాడుతూ త్వరలో శత వార్షికోత్సవం జరుపుకునే నాటికి అనువైన ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని, బ్రాంచీల సంఖ్య కనీసం 25 ఉండాలని సూచించగా సభ్యులు కరతాళధ్వనులతో స్వాగతించారు. బ్యాంకు కార్యకలాపాలను దాదాపు 15 మంది సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన ప్రతి సభ్యునికి పారితోషక బహుమతి ఇచ్చారు. 20వేల 10 మంది 'ఏ' తరగతి సభ్యులందరికీ వారి వారి షూర్ కాపిటల్‌కు 15శాతం డివిడెండ్‌ను బ్యాంకు లాభాల నుంచి ఇస్తున్నామని బ్యాంకు నిర్వాహకులు ప్రకటించారు.

అభివృద్ధికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే కొలికపూడి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కాకతీయ కమ్మ కల్యాణమండపంలో శనివారం రాత్రి జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్య, వైద్య, తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం దిశగా ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు ఉంటాయన్నారు. నియోజకవర్గాన్ని విద్యలకు కేంద్రంగా మారుస్తామని, చింతలపూడి ఎత్తిపోతల నిర్మాణంతో సాగునీటి కొరత సమస్య శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. టీడీపీ పార్టీతోపాటు మహాకూటమిలోని జనసేన, బీజేపీ కార్యకర్తలకు కూడా తాను అండగా ఉంటానని, వేధింపులకు గురి చేసినవారి లెక్కలు సరి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో పలుశాఖల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే ఆరోపణలు తన దృష్టికి వచ్చాయని, సమగ్ర విచారణ చేయించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవతా సేవా సంస్థ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ: మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ విజయవాడ శాఖకు 2024-25 నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా దావులూరి సాంబశివరావు, కార్యదర్శిగా పగిడిపల్లి రాము కోశాధికారిగా యసోద ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటీజన్స్ కార్యాలయం నందు మానవత సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి మరుబోయిన కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రిటైర్ మెంట్ అయి ఇంట్లో కూర్చోకుండా ఏ సమాజం నుండి లబ్ధి పొందామో అదే సమాజానికి చేతనైన చేయూతనిస్తూ ఉండాలని అన్నారు. ఆపదలో ఉన్న వారికి తోడుగా ఉండటమే లక్ష్యంగా ఉండాలన్నారు. ఈ సంస్థ అనతి కాలం లోనే రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిందన్నారు. గత ఏడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాలను సాంబశివరావు వివరించారు. మరణానంతరం నేత్ర శరీర దానం ఆవశ్యకతను వివరించారు. జిల్లా చైర్మన్ వేమూరు బాబురావు, ఉపాధ్యక్షులు టీ ఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శిగా నేమాని కామేశ్వరి, కమిటీ సభ్యులుగా సత్యనారాయణ రాజు రంగప్రసాద్, అరుణాచలం, చెరుకూరి బాబు, నాదెళ్ల సుమతీ , రామ్‌మోహనరావు ఉన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి మహాసభ : టీజీ వెంకటేష్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : కొత్త ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ది వెన్యూ ఫంక్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ విచ్చేసి నూతనంగా నియమితులైన రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజినీతో ప్రమాణ స్వీకారం చేయించారు అనంతరం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ సేవకు మారుపేరు ఆర్యవైశ్యులని ఆర్యవైశ్యులు సేవ చేయడంలో ముందుంటారని తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఆర్యవైశ్య మహాసభ ఎంతగానో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులపై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆర్యవైశ్యలంతా ఐక్యమత్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా విచ్చేసిన సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆర్యవైశు ్యలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు సీఏ పెనుగొండ సుబ్బారాయుడు ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ నూతన కార్యవర్గనికి ఆయన అభినందనలు తెలిపారు. సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా విభాగ్ రాష్ట్ర అధ్యక్షులు కొప్పురావూరి రజిని మాట్లాడుతూ తమ కార్యవర్గం ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు సమాజసేవ చేయడానికి ముందు ఉంటదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ విజయవాడ అధ్యక్షులు గడ్డం సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు దర్శి వాసు, తుమ్మలపెంట శ్రీనివాస్ గొంట్ల రామమోహన్రావు, మహిళా విభాగ్ విజయవాడ అధ్యక్షురాలు మారం రోజా రాణి ప్రధాన కార్యదర్శి ఆరవేటి నిర్మల కోశాధికారి శైలజరాని దళితులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసంస్థల కన్వీనర్ లయన్.జె.రంగారెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక సత్యసాయి సేవామందిరంలో ఈ శిబిరం ప్రారంభించనున్నామన్నారు. నూజివీడు జీఎంహెచ్ ఆసుపత్రికి చెందిన నేత్ర వైద్యనిపుణులు ఈ శిబిరంలో పాల్గొని సేవలందిస్తారన్నారు. శస్త్రచికిత్స అవసరంగా గుర్తించిన రోగులకు ఉచితంగా వీటిని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నీజెన్ డయాగ్నోస్టిక్స్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మహా నగరాలకు మాత్రమే పరిమితమైన అత్యున్నత శ్రేణి డయాగ్నోస్టిక్ సేవలను ప్రజలందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నీజెన్ డయాగ్నోస్టిక్స్ ఆదివారం లాంఛనంగా ఆరంభమైంది. ప్రకాశం రోడ్డులోని నీజెన్ డయాగ్నోస్టిక్స్ ను రెయిన్ బో హాస్పిటల్స్ సీఎండీ రమేష్ కంచర్ల ప్రారంభించారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా, ప్రపంచ స్థాయి వ్యాధి నిర్ధారణ వ్యవస్థగా నీజెన్ సేవలందించనుంది. ఈ సందర్భంగా, రెయిన్ బో హాస్పిటల్స్ సీఎండీ రమేష్ కంచర్ల మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి దయాగ్నోస్టిక్ సేవలను నగరంలో అందుబాటులోకి తేవడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి అత్యాధునిక రిఫరల్ ల్యాబ్, స్పెషాలిటీ ల్యాబ్స్, జినోమిక్స్.. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ఉపకరిస్తాయని రమేష్ కంచర్ల తెలిపారు. అనంతరం, నీజెన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రకాష్ మాట్లాడుతూ.. నిర్దిష్ట కాల వ్యవధిలో, అత్యంత కచ్చితంగా పరీక్షల ఫలితాలను అందిస్తామని చెప్పారు. నీజెన్ దయాగ్నోస్టిక్స్ నందు.. జెనెటిక్స్, జినోమిక్స్, ఫార్మాకోజినోమిక్స్, మైక్రో బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, రేడియాలజీ, బయో కెమిస్ట్రీ, పాథాలజీ, హెమటాలజీ ఫ్లోసైటోమెట్రీ, ఇమ్యూనాలజీ, యాంటీ నేటల్, ప్రీ నేటల్, న్యూబోర్న్ స్క్రీన్ తదితర రెండు వేల రకాలకు పైగా పరీక్షలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రామ్ ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పవర్ మెక్ ప్రాజెక్ట్ సీఎండీ సజ్జా కిషోర్ బాబు, నగరంలోని పలువురు వైద్య ప్రముఖులు, అంతర్జాతీయ దయాగ్నోస్టిక్స్ సాధన సంపత్తి ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగాలపాడులో పారిశుధ్యం అధ్వానం

విశాలాంధ్ర-నందిగామ: లింగాలపాడులో పారిశుధ్యం అధ్వాన్నంగా వుంది. ముఖ్యంగా హరిజనవాడలో మండల పరిషత్ పాఠశాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. రోడ్డు పక్కన చెత్త కుప్పలు, గేదెలు కట్టి వేయడంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డయేరియా విజృంభిస్తున్నందున నందిగామ ప్రజలు అవస్థలు పడుతు న్నారు. నందిగామ మండలం లో పలు గ్రామాలలో పారిశుధ్యం అధ్వాన్నంగా వుంది. గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా వున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

మద్దులమ్మ తల్లికి వరద పాశం

విశాలాంధ్ర-కంచికచర్ల: గొట్టుముక్కల అడవిలోని మద్దులమ్మ తల్లికి గొట్టుముక్కల గ్రామ ప్రజలు ఆదివారం వర్షం కురవాలని కోరుకుంటూ వరద పాశం పోశారు. అంతకుముందు మద్దులమ్మ తల్లి దేవాలయం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంచికచర్ల గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ మద్దులమ్మ దేవాలయానికి 10 కేజీల గంటను గుడికి బహుకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

దుర్గమ్మ చెంతకు మునగచర్ల గ్రామస్తులు పాదయాత్ర

విశాలాంధ్ర-నందిగామ రూరల్ న్యూస్ : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని వారు కోరిన కోరికలు నెరవేరడం తో మునగచర్ల గ్రామం నుండి విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయానికి పాదయాత్రగా ఆదివారం ఉదయం గ్రామస్తులు పెద్ద ఎత్తున బయలుదేరారు ఈ సందర్భంగా గ్రామ తెలుగుదేశం సర్పంచ్ పంగులూరు నరసింహయ్య మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప గ్రామంలో గత ఐదు సంవత్సరాలలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయలేదని అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని ఒకే కార్యచరణ తో గ్రామం మొత్తం ముక్తకంఠంతో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులుగా కేశినేని శివనాద్,నందిగామ నియోజకవర్గ శాసనసభ సభ్యురాలుగా తంగిరాల సౌమ్య గెలవాలని వారి గ్రామానికి అభివృద్ధి జరగాలని కోరుకున్నట్లు ఆ కోరిక నెరవేరిన సందర్భంలో నందిగామ మండలం మునగచర్ల గ్రామం నుండి విజయవాడలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయం వరకు గ్రామంలోని గ్రామస్తులు, మహిళలు,పెద్దలు పాదయాత్రగా బయలు దేరినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం నాయకులు మహిళా కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.